# ఇదివరకు ఈ సమస్య మొగపిల్లలతోటే వుండేది!...

పోస్టులో వచ్చిన పెళ్ళి శుభలేఖని చూసి "అరె! మన గజసింహ కొడుకు విక్రమ్ నీలిమని చేసుకుంటున్నాడా?" అన్నారు వీరేంద్రనాథ్ గారు.

"నీలిమ అంటే మేజర్ మార్తాండంగారి కూతురేకదూ?" అడిగింది సావిత్రి.

"అవును! ఆ పిల్ల చాలా.." ఏదో చెప్పబోయి ఆగిపోయారు వీరేంద్రనాథ్ గారు.

"ఆగిపోయేరేం? ఆ పిల్ల చాలా.. తెలివైనదా?" అడిగింది పావని.

"వీరేంద్రనాథ్ మాట్లాడకుండా వుండడం చూసి చెప్పరేం సగం సగం చెప్పి ఊరుకుంటారు. అదే నాకిష్టంలేదు. చెప్పండి?" గట్టిగా అడిగింది పావని.

"ఏంలేదు. ఆ పిల్ల 'చైన్ స్మోకరు' సిగరెట్టు మీద సిగరెట్టు కాల్చి పారేస్తుంది. మొగాడు పనికిరాడు తనముందు" అన్నారు వీరేంద్రనాథ్ గారు. తన చెవులను తానే నమ్మలేనట్టుగా ఆశ్చర్యంగా నోరు తెరిచి చూసింది పావని. కాస్సేపటికి తేరుకుని "ఏమండీ! అలా ఆ అమ్మాయి సిగరెట్లు తాగడం వాళ్ళమ్మా నాన్నలకి తెలీదా?" అడిగింది.

"ఎందుకు తెలీదు? నాకూ నీకూ కూడా తెలిసినప్పుడు వాళ్ళకి తెలీకుండా వుంటుందా? అదొక ఫాషన్ అని గొప్పగా ఊరుకుంటారు. ఇప్పుడది ఒదలలేని అలవాటుగా మారి కూర్చుంది."

"ఆడపిల్ల సిగరెట్ తాగుతూంటే ఫాషన్ అని ఊరుకోవడమేమిటండీ? మొగపిల్లలకే ఈ అలవాటు ఎక్కడవుతుందా అని భయపడి ఛస్తూ వుంటే?"

ఆశ్చర్యంలోంచి తేరుకోకుండా గుడ్లు తిప్పుతూ అంది పావని.

"చూడు పావని ఆ బాధా, ఆ భయం అంతా నీలాంటి పాతకాలం వాళ్ళకి. మోడరన్‌గా వుండేవాళ్ళకి, ఇదే నాగరికతా అనుకునే వాళ్ళకీ కాదు" అన్నారు వీరేంద్రనాథ్ గారు పేపరు చదువుకుంటూ.

"ఏ కాలమయినా సిగరెట్టు సిగరెట్టే కదండీ? మరి అది ఆడవాళ్ళకయినా మొగాళ్ళకయినా హానికరమే కదా? మొగాళ్లు ఈ అలవాటుకి బానిసలై బాధపడుతూ వుంటే నచ్చజెప్పి నయాన్నో భయాన్నో ఈ అలవాటు నుంచి దూరం చెయ్యాలని తాపత్రయపడే ఇల్లాలూ, తల్లీ తనే ఈ అలవాటుకి బానిసైపోతే ఇంక భర్తకీ పిల్లలకీ ఏం బుద్ధి చెబుతుంది?"

"మొగుడూ, పెళ్ళాం, పిల్లలు ఎంచక్కా బ్రేక్‌ఫాస్ట్‌కి బదులు తలా ఒకరకం బ్రాండు సిగరెట్టు తాగుతూ కూర్చుంటారు." పకపకా నవ్వారు వీరేంద్రనాథ్ గారు.

పావని నవ్వలేకపోయింది. ఆమె మనసులో తీరని వ్యథ. కడుపులో పేగులను చెయ్యిపెట్టి కలచివేస్తున్నట్టనిపించింది. ఎటు పోతున్నాం మనం? ఎందరో పుణ్యవతులకు పుట్టిల్లు మన దేశం? ఎందరో పతివ్రతలకు నిలయం మన దేశం! ఎందరో వీరపత్నులకు, వీరమాతలకు నెలవు మన దేశం. అటువంటి చరిత్రగల మన దేశం ఇప్పుడెటు పోతోంది?

స్త్రీకి సమాన హక్కులు కావాలనీ, ఆమె వ్యక్తిత్వానికి ఒక గుర్తింపు కావాలనీ, ఆమెకీ విద్యాప్రాప్తి ఆర్థిక స్వాతంత్ర్యం కావాలని పోరుసలిపి ఆ హక్కులను సాధించామని కొంతవరకైనా సంబరపడుతూంటే నాగరికతపేరిట సమానత్వాన్ని ఇలాగ ఉపయోగించుకోవడం? ఈ రకమైన నాగరీక సమాజంలో ఈ రకమైన సమానత్వపు పరిధిలో ఎన్ని కుటుంబాలు నిజంగా సంతోషంగా వున్నాయి? ఎన్ని కుటుంబాలలో పిల్లలు ఏ దురలవాట్లకి లోనుకాకుండా నీతీ, భీతివంటి నియమాలతో పెరుగుతున్నారు? ఆలోచిస్తున్నకొద్దీ పావనికి తల తిరుగుతోంది.

సిగరెట్టు తాగే స్త్రీ గర్భవతైతే కడుపులో పడ్డ బిడ్డకి, గర్భంలో వుండగానే

సిగరెట్టు లోని నికోటిన్ అలవాటవుతుందన్న మాట! ప్రొటీన్లు, విటమిన్ల సంగతి దేముడికి తెలుసు. తల్లి ఆ గర్భస్థ శిశువుకి పుట్టకముందే నికోటిన్‌ని అందిస్తోందన్న మాట! మైగాడ్! దానివల్ల ఆ బిడ్డ ఎంత అనారోగ్యంతో పుడతాదో? ఎటువంటి సమస్యలతో పుడతాడో! అర్థం చేసుకోలేక పోతోంది. భగవంతుడా ఇదా భారతదేశం? ఇదా సుజల, సుఫల, సుచరితగా పేరెన్నికగన్న దేశం? ఇక ఆలోచించలేక నీరసం కమ్ముకున్నట్టుంటే కుర్చీలో చతికిలబడింది.

"అది కాదండీ! ఆ పిల్ల నీలిమ సిగరెట్లు మానేదెట్లాగ?" అంది.

"చూడు పావనీ? ఆ సమస్య వాళ్లది. నువ్వూ నేనూ ఏమి చెయ్యలేం? మనసుంటే మార్గాలెన్నో వుంటాయి. లేదా సమస్యలొచ్చినప్పుడు ఆరోగ్యం క్షీణించిపోతే డాక్టర్లు చెబితే చచ్చినట్టు అప్పుడాలోచిస్తారు. అంతేకానీ మనమేం చేస్తాం. పైగా నీకు తెలిసింది ఈ నీలిమ ఒక్కర్తే. ఇంకా ఎంతమంది నీలిమలున్నారో? ఏం చేస్తాం? లే! నాకొక కప్పు కాఫీ ఇవ్వు!" అన్నారు వీరేంద్రనాథ్ గారు. ఆమెను ఆ ఆలోచనల్లోంచి మళ్ళిస్తూ.

"అయ్యో భగవంతుడా! ఇన్నాళ్లూ ఈ సమస్య ఒక్క మొగపిల్లలకే, మొగవాళ్లకి మాత్రమే పరిమితమై వుండేది. పిల్లలకి ఈ అలవాటు కాకుండా పెద్దలకి ఈ అలవాటు మాన్పించడానికి భార్యగా, తల్లిగా సతమతమయిపోయేది ఇల్లాలు. ఇప్పుడు ఆడపిల్లల్ని కూడా ఓ కంట కనిపెట్టి వుండాల్సిన పరిస్థితొచ్చిందా? దేవుడా? ఇదేనా నాగరికత? ఇదేనా ప్రగతి? ఏది దీనికి పరిష్కారం? ఏది దీనికి సమాధానం" ఆలోచిస్తూ కాఫీ కలుపుతోంది పావని సమాధానాలు దొరకని ప్రశ్నలతో వేగిపోతూ! ★